



## ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

### -జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్



తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 27 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో 2024-25 ఖరీఫ్ పంట కాలంలో పండించే ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ జిల్లా, సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యవసాయ శాఖ అగ్రికల్చరల్ వారిని ధాన్యం కోతలు చేయడానికి జనవరి 3వ వారం కంతా ఈ క్రాప్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువ ధరకు ధాన్యం విక్రయించే దుస్థితి ఏ ఒక్క రైతుకు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన సిబ్బందిని జిల్లా కో-ఆపరేటివ్ సంస్థ వారి ద్వారా నియమించుకోవాలన్నారు. ఏ దశలో కూడా ఎటువంటి అవాంతరాలు ఎదురుపడకుండా తగిన చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు.

## వెంకన్న సేవలో క్రీడాకారిణి సింధు వధూవరులు



తిరుమల,డిసెంబర్ 27 ప్రభాతవార్తప్రతినిధి: నూతన దంపతులు బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు శుక్రవారం శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. భర్త దత్తవెంకటసాయితో కలసి అభిషేకసేవలో శ్రీవారిని దర్శించుకున్నారు.

## మంచుతెరల్లో సప్తగిరులు





తిరుమల,డిసెంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి: భిన్నమైన వాతావరణానికి నిలయంగా మారిన తిరుమల సప్తగిరులు ఇప్పుడు మంచుతెరలు అలముకున్న రమణీయ దృశ్యంగా మారింది. ఏడుకొండలను మంచు దుప్పటి కప్పుకొన్నట్లు దర్శనమిస్తున్నాయి. తిరుమలలో మారిన వాతావరణంతో ఆహ్లాదకరంగా ఉంది. ఆనంద నిలయాన్ని తెల్లటి మబ్బులు కప్పేశాయా అన్నట్లు మారింది. తిరుమల ఆలయంపైనేగాక కొండంతా పాపవినాశనం, జపాలి. అఖిలాండం ప్రాంతం మంచుతో తెల్లవారుజామున కప్పేస్తోంది. భక్తులు ఈ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

## రోడ్డెక్కిన వైకాపా

### - పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు






పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం , ట్రాన్స్‌కో టెక్నికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రోజా

చిత్తూరు,తిరుపతి డిసెంబర్ 27 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఆరు నెలల క్రితం ఏర్పడిన ప్రభుత్వంపై అప్పుడే ప్రతిపక్ష వైకాపా యుద్ధం ప్రకటించింది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోని ప్రభుత్వం కరెంటు ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో ఇప్పటి వరకు స్తబ్దుగా వున్న వైకాపా ప్రజల్లోకి వెళ్ళాలని నిర్ణయించింది. పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ నియోజకవర్గ కేంద్రాల్లో భారీగా ధర్నాలు నిర్వహించి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈ మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రోడ్డెక్కారు. జిల్లా కేంద్రం చిత్తూరులో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో కట్టమంచి వివేకానంద స్వామి విగ్రహం నుండి గాంధీ రోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి, విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు నియోజకవర్గం కేంద్రం పూతలపట్టులో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి ర్యాలీగా ట్రాన్స్‌కో కార్యాలయం వరకు వెళ్ళి నాయకులు, కార్యకర్తలు ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. పుంగనూరు పట్టణంలో వైఎస్‌ఆర్సిపి పార్టీ ఆదేశాల మేరకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు శుక్రవారం విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమంలో పాల్గొనీ స్థానిక ప్రైవేట్ బస్టాండ్ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. నగరి నియోజక వర్గంలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా ఆధ్వర్యంలో నగరి నియోజక వర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలు ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తిలో వైఎస్‌ఆర్ సిపి పోరుబాట కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి, మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వయ్యాలకృష్ణారెడ్డి, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, పులిరామచంద్ర, మాజీ ఎంపిపి కోవిచంద్రయ్య నాయుడులతో కలసి ఏపిఎస్‌పిసిడిసిఎల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. చంద్రగిరిలో నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. టవర్ క్లాక్ వద్ద నుండి సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాదవరెడ్డి, విరూపాక్షి ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిడినెల్లూరు, పలమనేరు నియోజకవర్గాల్లో సైతం వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్ళి ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

## జిల్లాలో 70 శాతం వరకు రెవెన్యూ సమస్యలే

### - జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్



నాయుడుపేట రూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త
తిరుపతి జిల్లాలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారు 70 శాతం వరకు రెవెన్యూకు సంబంధించిన సమస్యలే వస్తున్నాయని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం నాయుడుపేట మండలం విన్నమాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రెవెన్యూ సమస్యలైన 1బి, అడంగళ్, పాస్‌బుక్‌లు, ముటేషన్, భూవివాదాలు తదితర ఎన్నోరకాల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను 33 రోజుల పాటు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు జరుపుతున్నట్లు తెలిపారు. అధికారులు ప్రజల సమస్యలను క్రమపద్ధతి ప్రకారం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలో ఐదు జోన్లుగా ప్రభుత్వం రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిందని, అందులో తిరుపతి జిల్లా కూడా ఉందని తెలిపారు. త్వరలో మంత్రి, సిసిఎల్ఎ, ల్యాండ్ కమిషనర్ తదితర ఉన్నతాధికారుల బృందం సమావేశం జరుగుతుందని తెలిపారు. విన్నమాల గ్రామ సమస్యలపై స్పందించిన ఆయన విన్నమాల నుంచి తన్నమాల వరకు మూడున్నర కిలోమీటర్ల రోడ్డును ఏర్పాటు చేసేందుకు, స్మశాన స్థలం కేటాయించేందుకు, ఎస్టీ కాలనీలలో ఇంటి కొళాయిలు, వీధిలైట్లు, వీధి రోడ్డు నిర్మాణానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇదేవిధంగా నాయుడుపేట హైవే నుంచి విన్నమాలకు రోడ్డు మార్గం ఏర్పాటుకు ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను గ్రామాల్లోనే ఏర్పాటు చేసిందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి విన్నమాల తదితర ప్రాంతాల రెవెన్యూ, ఇతర సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, తహశీల్దార్ మాగర్ల రాజేంద్ర, ఇతర శాఖల అధికారులు, నాయకులు నెలవల రాజేష్, దార్ల రాజేంద్ర, ఆమవరపు సత్యం, మధురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అటకానితిప్పలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లు పరిశీలన



సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త
సూళ్లూరుపేట కేంద్రంగా జనవరి 17, 18, 19 తేదీలలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లు, మౌలిక వసతుల కల్పన అనే అంశాలపై శుక్రవారం డిఆర్‌డిఎ పీడీ శోభన్ బాబు ఆధ్వర్యంలో మండల పరిధిలోని అటకానితిప్ప పర్యావరణ పరిరక్షణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అటకానితిప్పలో గత ఫ్లెమింగో ఫెస్టివల్‌లో కేవలం సందర్శకులకు విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించే ఏర్పాట్లు మాత్రమే చేశారని తెలిపారు. కాగా, ప్రస్తుతం జరగబోయే ఫెస్టివల్‌లో స్నేక్ షో, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మూడురోజులు పాటు అటకానితిప్పకు వచ్చే సందర్శకులకు మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు సరయిన ప్రణాళికలు రూపొందించుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఫ్లెమింగో పక్షులను వీక్షించేందుకు అటకానితిప్ప వద్ద మాత్రమే వీలు ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలోని వ్యూ పాయింట్ వద్ద తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఫ్లెమింగో ఫెస్టివల్ కమిటీ అన్ని చర్యలు చేపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ నరసింహారావు, ఆర్ఐ రాజగోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ చంద్రశేఖర్, ఏఇ భవాని, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సోషల్‌మీడియా పోస్టింగ్స్‌పై

## తిరుపతిలోనూ రాజకీయ చర్చ !

### మన మంచికోసం వాడుదాం అంటూ వెలసిన హోర్డింగ్‌లు




ప్రభాతవార్త-తిరుపతి: ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలలకు సోషల్ మీడి యాపై కన్నెర్రజేసింది. అవసరమైన కార్యక్రమాలు, ప్రచారాలకు గాకుండా రాజకీయంగా తప్పుడు ప్రచారాలకు, వివాదాలకు కారణంగా మారడంతో పెద్ద దుమారం రేపింది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో సోషల్‌మీడియా ప్రచారం మరీ ఎక్కువైంది. అదికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు సోషల్‌మీడియాను అవసరమైన మంచి కార్యక్రమాలు ప్రచారం చేయడానికి వినియోగించాలని రాష్ట్రంలో చట్టంతీసుకురాకముందే ప్లెక్సీలు వెలిశాయి. తిరుపతిలో వెస్టుచర్చికూడలిలో "సోషల్‌మీడియాను మన మంచి కోసం వాడుదాం

**అసత్య ప్రచారాలకు దూషణలకు స్వస్తి పలుకుదాం**

తప్పుడు పోస్టు చేయొద్దు "అనే నినాదంతో ప్రచారంగా ప్లెక్సీలు ఏర్పాటుచేశారు. అయితే దీన్ని ఎవరు ఏర్పాటుచేశారనేది చర్చగా మారింది. ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతోనే అన్నట్లు తిరుపతి వాసులు, మేదావులు, విద్యావేత్తలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా మూడుకోతుల బొమ్మలతో సోషల్‌మీడియాలో చెడు ప్రచారం వద్దన్న ప్లెక్సీలు మాత్రం తిరుపతిలో హాట్‌టాఫిక్‌గా మారాయి. మరీ తిరుపతిలో ఈ ప్లెక్సీని అందరూ ప్రత్యేకంగా చూస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల కట్టడికి సమిష్టిగా విధులు

### - హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం
### - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు




- హెల్మెట్ ధారణపై విస్తృత ప్రచారం
- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడంలో భాగంగా బ్లాక్ స్పాట్స్ వున్న ప్రాంతాల్లో సత్వరం ప్రమాదాల కట్టడికి చర్యలు చేపట్టేలా జాతీయ రహదారుల అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో సమస్యాత్మక జంక్షన్లు, స్కూల్ జోన్స్, కళాశాలలు, హాస్పిటళ్ళ వద్ద స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రంబుల్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. జిల్లాలోని జాతీయ రహదారుల్లో 24 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్స్‌ను ఇది వరకే గుర్తించి ఇక్కడ రోడ్డు ప్రమాదాల కట్టడి కోసం నేషనల్ హైవేస్ ఆథారిటీ చేపట్టాల్సిన చర్యలపై ఇప్పటికే తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఈ పనులు జరుగుతున్న తీరుపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు సమావేశంలో అర్డీఓ నిరంజన్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకులలో మితిమీరిన మాయాజాలం

పాకాల, డిసెంబర్ 27, ప్రభాతవార్త
పాకాల మండలంలో మొత్తం ఆరు పెట్రోల్ బంకులు ఉండగా, అందులో ఒకటో ఆరో పెట్రోల్ బంకుల్లో తప్పితే మిగతా వేటిలో కూడా నిబంధనల మేరకు వాహనదారులకు కల్పించవలసిన కనీస సదుపాయాలు లేవు. వాహనదారులకి సౌకర్యాల కల్పనలో పాకాల మండలంలోని బంకుల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వాహనదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. టాయిలెట్లు, మంచినీరు, ఎయిర్ పంపులు సరిగా పనిచేయడం లేదు, కొన్ని బంకులలో ఎయిర్ కంప్రెసర్లని ఎప్పుడో మూలన పడేశారు. కొన్ని బంకులలో అయితే నాణ్యత లేని పెట్రోల్ డీజిల్ అమ్ముతూ వున్నారు. పంపులు రీడింగ్ చాలా వేగంగా జంప్ అవుతూ ఒక లీటర్ పెట్రోల్ మొత్తంనికి కొద్ది మొత్తం తగ్గుతోందని వాదనలు వినిపిస్తున్నాయి. మరి కొన్ని పెట్రోల్ బంకులు అయితే మరి దారుణం పవర్ పెట్రోల్ స్థానంలో నెలకు రెండు మూడు లోడ్‌లు మాములు పెట్రోల్ ట్యాంకులో దింపుకొని పవర్ పెట్రోల్ పేరుట మామూలు పెట్రోలు యదేచ్ఛగా విక్రయిస్తూ వాహనదారులని బురిడీ కొట్టిస్తున్నారు. సాధారణ పెట్రోల్ స్టాక్ లేదని వాహనదారుకు బలవంతంగా పవర్ పెట్రోల్, డీజిల్ మాత్రమే వుంది అని వాహనదారులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని బంకులు నాణ్యతలేని పెట్రోల్ డీజిల్ విక్రయిస్తూ ఉండడంతో తరచూ తమ వాహనాల ఇంజన్లు పాడయిపోతున్నాయని వినియోగదారులు అంటున్నారు. మండలంలో ఇంత పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్నా నాణ్యమైన పెట్రోలు, డిజిల్ బదులు నాసిరకం ఇందనం అమ్మేస్తున్నా అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడకుండా పోవడం గమనార్హం. ఇప్పటికైనా తూనికలు కొలతల శాఖ అధికారులు పాకాల మండలంలోని బంకులను తరచూ తనిఖీ చేసి వినియోగదారులకి నాణ్యమైన పెట్రోల్, డీజిల్ బంకుల యాజమాన్యాలు విక్రయించేలా చర్యలు తీసుకోవలసినదిగా వాహనదారులు, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి వెంకటాద్రి నాయుడు కోరుతున్నారు.

## ఆక్రమార్కులపై కదులుతున్న డొంక

### రాజీవ్ నగర్ అక్రమ విక్రయాలపై జయశ్యాంపై కేసు



రాజీవ్‌నగర్‌లో జయశ్యాంకు సంబంధించి బహుళ అంతస్థుల భవనం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో నిరుపేదలకు చెందిన భూములను,అలాగే ప్రభుత్వ భూములకు సంబంధించి గత ప్రభుత్వ హాయాంలో విచ్చల విడిగా ఆక్రమణలు,విక్రయాలు జరపటంలో వైకాపాకుచెందిన శాసనసభ్యునికి అనుయాయులుగా ఉంటూ కీలకంగా వ్యవహారించారు. అయితే గతంలో అదికారం ఉంది కాబట్టి ఎవ్వరూ పెదవి విప్పలేదు. దాంతో అధికార బలంతో లెక్కలేనన్ని అమ్మకాలు జరిపారు.ఈ తతంగంలో కొందరు రెవెన్యూ సిబ్బంది కూడా సహాకరించారు.ఈ నేపథ్యంలో రాజీవ్‌నగర్‌లో కేశవులు అనే ఓ వ్యక్తికి మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు ఎంఎల్‌ఏకు ముఖ్య అనుచరుడుగా వ్యవహారించిన బుల్లెట్ జయశ్యాం వారి తల్లి వాసంతిలు విక్రయించినట్లు ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదును అనుసరించి తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య సమగ్ర విచారణ జరిపారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించిన మీదట జయశ్యాం, వాసంతిలు విక్రయించిన ఇంటి స్థలాలు ప్రభుత్వ భూములని తేలటంతో కేసు నమోదు చేసారు.శుక్రవారం జయశ్యాంను అరెస్టు చేసి రియాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య వివరించారు.

అధికార ముసుగులో ఇంకెన్నో . . .

శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ గత పాలకులు వైకాపా నాయకుని అనుచరులు ఓ కామధేనుగా మలచుకున్నారు. రాజకీయ నాయకులకు తోడు కొందరు మీడియాకు చెందిన వారు,రెవెన్యూ వారు సహాకరించటంతో వందల నిరుపేదల ప్రభుత్వ ప్లాట్లను విక్రయించారు. ఈ డొంకను ప్రస్తుతం కదిలించారు. మొదటి బోణిగా మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యాంపై కేసు నమోదు చేసి అరెస్టు చేసారు. ఇది ఒక ఫిర్యాదు మాత్రమే ఇలా ఎన్నో ప్లాట్లను తమదే అని విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. మీడియాకు సంబంధించిన వారి ప్లాట్లను అక్రమించుకొని బహుళ అంతస్థుల భవనాలను నిర్మించారు.వీటికి సంబంధించి కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. గత పాలనలో నాయకుని గ్రీన్ సిగ్నల్‌తో రాజీవ్‌నగర్‌ను ఓ అగ్రహారంగా మలచుకొని విచ్చల విడిగా వ్యాపారం సాగించారు. లక్షలకు లక్షలు వెనకేసుకున్నట్లు విమర్శలున్నాయి.

## నూతన సంవత్సరాదిన భక్తులందరికి సంతృప్తికర దర్శనం

### అన్ని శాఖల సమన్వయంతో పగడ్బందీ ఏర్పాట్లు -జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



కాణిపాకం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో 2025 నూతన సంవత్సరాదికి సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించే విధంగా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కాణిపాకం దేవస్థానంలో నూతన సంవత్సరాది ఏర్పాట్లపై స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్పీ మణికంఠ చందోలు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్‌లతో కలసి వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో నూతన సంవత్సరాది సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశమున్నట్లు తెలిపారు. ఆలయ దర్శనార్థం తరలివచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామివారి సంతృప్తికర దర్శనం కల్పించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమ్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు క్యూలైన్లు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, కంట్రోల్ రూం ఏర్పాటు, పారిశుద్ధ్యం, మెడికల్ క్యాంపు వంటి వాటి గురించి ఆయా శాఖలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ నూతన సంవత్సరాది రోజున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసుకోవాలని, క్యూలైన్లు నిర్వహణ, సీనియర్ సిటిజన్‌లు, చంటి పిల్లలకు ఎటువంట అసౌకర్యం కలుగకుండా పక్కా ఏర్పాట్లు వుండాలన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ నూతన సంవత్సరాది సందర్భంగా సుమారు 60 నుండి 70 వేల మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నిరంతరాయంగా నిత్యాన్నదానం వుంటుందని తెలిపారు. జనవరి 1 తెల్లవారు జామున ఉభయదారుల దర్శనానంతరం స్వామివారి దర్శనం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు దర్శనం వుంటుందన్నారు. ఈసందర్భంగా ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశామని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి,వాసు, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై ధరణీధర, అడిషినల్ డీఎంఅండ్‌హెచ్ఓ వెంకట ప్రసాద్, ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్, ఈఓపీఆర్డీ కుసుమకుమారిలతో పాటు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రాజెక్ట్ పోటీల్లో బాలికల హైస్కూల్ విద్యార్థినులకు ప్రథమస్థానం



**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త** కుప్పం అగస్త్య ఇంటర్నేషల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన జిజ్ఞాస పోటీల్లో కుప్పం బాలికల హైస్కూల్ విద్యార్థినులు చేపట్టిన ప్రాజెక్టుకు ప్రథమస్థానం లభించినట్లు హెచ్ఎం వెంకటేశ్వరబాబు తెలిపారు. తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు వర్షిణి, అక్షయలు మట్టి లేకుండా మొక్కల పెంపకం, సామర్థ్యంపై నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో నిలవడంతో పాటు మూడువేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు పొందినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి సైతం ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వరబాబు, ఉపాధ్యాయులు ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు.

## భూ సమస్యల పరిష్కారంకే రెవెన్యూ సదస్సులు

**కుప్పంరూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త**



రైతులు, ప్రజల భూ సమస్యల పరిష్కారంకే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. చీలేపల్లి సచివాలయంలో పలార్లపల్లి, బేవనపల్లి గ్రామాలకు సంబంధించి రెవెన్యూ సదస్సును తహశీల్దార్ చిట్టిబాబు అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, విఆర్వో ఎంసి శ్రీనివాసులు, నేతలు మాణిక్యం, ప్రతాప్‌సింహ, రాజేష్, మురుగేష్, వేణు, హరీష్, కమల్, రమేష్, క్రాంతి, నటరాజ్, జగన్మోహన్, అమరేశన్ పాల్గొన్నారు.

## కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌చే నూతన భవనాల పరిశీలన

**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త**



కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో నూతన ంగా నిర్మించి ప్రారంభోత్స వాలకు సిద్ధంగా ఉన్న భవనాలను కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. వచ్చే నెలలో సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన ఉండనున్న నేపథ్యంలో నూతన భవనాలతో పాటు నిరుద్యోగులకు నిర్వహించనున్న శిక్షణ తరగతులుకు సంబంధించిన ఏర్పాట్లను పిడి పరిశీలించారు. కార్యక్రమంలో వర్సిటీ వి.సి. ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల, డిఇ రఘుపతి పాల్గొన్నారు.

## సత్వరం పెంచిన ఛార్జీలు తగ్గింపు

**– చిత్తూరులో వైకాపా ఆధ్వర్యంలో భారీ ధర్నా**



**చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**

అధిష్ఠానం పిలుపుమేరకు శుక్రవారం పెంచిన విద్యుత్‌ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చిత్తూరు ట్రాన్స్‌కో డిఇ కార్యాలయం ఎదుట చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కట్టమంచి స్వామి వివేకానంద విగ్రహం నుండి ర్యాలీగా ప్రారంభమైన వైకాపా నాయకులు, కార్యకర్తలు గాంధీ రోడ్డులోని ట్రాన్స్‌కో డిఇ కార్యాలం వరకు వెళ్ళి అక్కడ ధర్నా నిర్వహించారు. వైకాపా నాయకుడు ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ అపద్దాలు చెప్పి ఎన్నికల్లో విజయం సాధించిన సిఎం చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు ఒక్క హామీని సైతం పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, జ్ఞాన ప్రకాష్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ రంగం మాజీ సిఎం వైఎస్ జగన్‌తో నాశనం

**– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీ సురేంద్రకుమార్**



**చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ రంగం సర్వ నాశనం చేసింది మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ళ పాటు విద్యుత్ రంగంను నాశనం చేసి ఇప్పుడు వైకాపా ధర్నా చేయడం విడ్డూరంగా వుందని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం నాయకులు మోహన్‌రాజ్, జాఫర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ నావెల్ క్యాడెట్‌కు అభినందన



**కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త** కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో థర్డ్ బిటెక్ చదువుతున్న గాయత్రి, సెకండియర్ బిటెక్ చదువుతున్న హరికృష్ణ, డిలేంద్ర అనే వారు ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు ఐఎన్ఎస్ఎస్ సర్కార్ వైజాగ్‌లో 10(ఎ) నావెల్ యూనిట్ గుంటూరు గ్రూప్ నుంచి స్కుబా డ్రైవింగ్ అడెంచర్ కోర్సుకు ఎంపికయ్యారు. అక్కడ కోర్సును దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, నావెల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి ఆ ఎన్‌సిసి క్యాడెట్లను అభినందించారు.

## జాబ్ మేళాపై అవగాహన సదస్సు

**కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త**

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాలను శుక్రవారం డిగ్రీ విద్యార్థులకు జాబ్‌మేళాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడపకు చెందిన టర్నింగ్ పాయింట్ డైరెక్టర్ ఉత్తమరెడ్డి విచ్చేశారు. విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందాలంటే విద్యార్థులకు స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం



**చిల్లకూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

చిల్లకూరు మండలంలోని చేడిమాల గ్రామంలో శుక్రవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో, వెంకటాచలం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సౌజన్యంతో పేదలకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర రోగులకు పరీక్షలను నిర్వహించి, వారి చేతుల మీదుగా ముందలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పిచ్చయ్య నాయుడు, కార్యదర్శి రామయ్య నాయుడు, ఎంఈఓ రవూఫ్, కంటి వైద్యులు ప్రశాంత్, ట్రస్ట్ సభ్యులు బాబు, ప్రజేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తశుద్ధి లేని పోరుబాటతాళ్ల వెంకటేష్ గౌడ్

**బాలాయపల్లి, డిసెంబర్ 27, ప్రభాతవార్త**



చిత్తశుద్ధి లేని పోరుబాటలు చేస్తున్నారని తాళ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. తెలుగు యువత నియోజకవర్గ అధికార ప్రతినిధి తాళ్ళ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అంచెలు అంచెలుగా కరెంట్ ఛార్జీలు పెంచి, అధికారం పొయ్యాక ప్రజల మీద సవతి ప్రేమ చూపించాలని అనిపించిందని ఎద్దేవా చేశారు. మీ పాలనలో మీరు బాదిన కరెంటు చార్జీల బాదుడితో రాష్ట్రంలోని పేద ప్రజల నడ్డి విరిచారని, కరెంటు చార్జీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు.

## విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి : డిఇఓ

**పలమనేరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త:**



10వ తరగతిలో విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిఇఓ వరలక్ష్మీ తెలిపారు. పలమనేరు డివిజన్ పరిధిలోని 10 మండలాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డిఇఓ మాట్లాడుతూ నెలాఖరులోపు 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతిలో విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్లన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎంఇఓలు లీలారాణి, బాలసుందరం, గంగవరం ఎంఇఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం

**– జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి**



**పెనుమూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**

రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పులిగుండు వద్ద మ్యాంగోభవన్‌లో పులిగుంటీశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మామిడి, ఇతర ఉద్యాన పంటలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు మామిడి పంటపై బీమా చేసుకోవాలని, ఎకరానికి రూ.1,750 చెల్లించి బీమా చేసుకుంటే మంచిదని పేర్కొన్నారు. మామిడిలో దిగుబడి పంటకు ఏ ఏ మందులు పిచికారి చేయాలో, తెగుళ్ళ నివారణ గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రంజిత్‌కుమార్, ఖాదీ బోర్డు అధికారి ప్రసాద్, ప్రకృతి సంఘ కమిటీ ఛైర్మన్ పసపల హరికృష్ణారెడ్డి, సిఇఓ చందన, రైతు నాయకులు జగన్నాథరెడ్డి, జ్ఞానశేఖర్, సంధ్య, ఝాన్సీ, సుప్రియ, తిరుపతి ఆకాశవాణి అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్ర సహకార సంఘ కార్యవర్గం

**బంగారుపాళ్యం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**



గంగపుత్ర మత్స్య సహకార సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రామ్మోహన్ నిర్వహించగా సిబ్బంది పుల్లయ్య, గౌరి, మైకన్ తదితరులు పర్యవేక్షించారు. నూతన సహకార సంఘ అధ్యక్షుడిగా వి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా పివి రెడ్డప్ప, ప్రధాన కార్యదర్శిగా కె.కేశవులు, డైరెక్టర్లుగా కె.రాజేంద్ర, జి.చంద్రశేఖర్, బి.ఉమాపతి, బి.మోహన్‌బాబు, డి.శ్రీనివాసులు, కెఎం సుభాష్‌చంద్రబోస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన ఈ సహకార సంఘ పదవికాలం ఐదేళ్లపాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంఘ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సంఘంలోని సభ్యుల సహకారంతో ముందుకు వెళ్తానన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి తన వుంతు సహకారం అందిస్తానన్నారు.

## అబాకస్‌లో సమీర ప్రతిభ

**బంగారుపాళ్యం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**




బంగారుపాళ్యంకు చెందిన సమీర అబాకస్ పోటీల్లో విశేష ప్రతిభను కనబరచింది. ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన అబాకస్ అంతరాజతీయ, జాతీయ పోటీల్లో సమీర పాల్గొంది. అంతర్జాతీయ స్థాయిలో సమీర రెండవ స్థానం సాధించగా, జాతీయ స్థాయిలో రన్నర్‌గా విజయం కైవసం చేసుకుంది. సమీర చిత్తూరు బివి రెడ్డి పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నది. విద్యార్థిని తండ్రి షాదిక్ పలువురు కుటుంబసభ్యులు, సన్నిహితులు సమీర సాధించిన విజయంపై హర్షం వెలిబుచ్చారు.

## విద్యార్థుల్ని నైపుణ్యవంతులుగా మలచడమే లక్ష్యం

**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త**



విద్యార్థుల్ని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్, బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ జన్మదినం సందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం లాంటి వెనుకబడిన ప్రాంతంలో విద్యార్థులను సా ంకేతికవిద్యలో తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రముఖ కార్పోరేట్ సంస్థలు, ప్రభుత్వ శాఖల్లో పనిచేయడంతో పాటు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇది తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఈసందర్భంగా తమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 449మంది సిబ్బందికి ప్రతి ఒక్కరికి ఐదు లక్షల వంతున 22.5కోట్ల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే విజలాపురం కస్తూరిబా గురుకులంలో ల్యాబ్‌కు 1.50లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను బిసిఎన్ ఛారిటబుల్ ట్రస్ట్‌చే అందించారు. లయన్స్‌క్లబ్‌వారు బిసి నాగరాజ్‌కు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డు అందించారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, లైబ్రేరియన్ డా॥ శరవణ, ఎన్ఎస్ఎస్ పిఓ మాధవన్, కోఆర్డినేటర్ గంగాధర్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, డా॥ అర్చన తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి - ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్

**– కుప్పంలో వైకాపా శ్రేణుల పోరుబాట !!**

**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త**



ఎన్డీయే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ కెఆర్‌జె భరత్ డిమాండ్ చేశారు. వైకాపా అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం కుప్పంలో విద్యుత్ చార్జీలపెంపును నిరశిస్తూ ఎమ్మెల్సీ భరత్ అధ్వర్యంలో వైకాపా శ్రేణులు నిరసన తెలిపాయి. స్థానిక వైఎస్ విగ్రహం వద్దనుంచి రెస్కో కార్యాలయం దాకా ర్యాలీ నిర్వహించిన అనంతరం రెస్కో ఎండి సోమశేఖర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచేది లేదని ఎన్నికలముందు చెప్పిన ఎన్డీయే ప్రభుత్వం రెండు విడతలుగా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే ప్రజల తరపున తాము పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, వన్నియకులక్షత్రియ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ఎం శ్రీను, రామకుప్పం, శాంతిపురం మండల పార్టీ అధ్యక్షులు బాబురెడ్డి, దండపాణి, నేతలు భాగ్యరాజ్, మోహన్‌రాం, రామూర్తి, మణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పోరుబాటకు వైసీపీ నాయకులు

**కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త**

వైసీపీ విద్యుత్ ఉద్యమ పోరుబాటకు కోట, వాకాడు మండలాల నుంచి కార్యకర్తలు హోరెత్తారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం గూడూరులో వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీకి కోట, వాకాడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ ర్యాలీకి నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, విజయసారథిరెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు వెళ్లారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మద్యం మత్తులో బస్సుకిందకు దూరిన ఘనుడు

**–తృటిలో తప్పిన ప్రమాదం**




**చౌడేపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త**

ప్రయాణీకులతో బస్టాండు రద్దీగా వున్న సమయది... పాఠశాలకు చెందిన బస్సులన్నీ ఒక్కొక్కటిగా తరుణంలో ఓ వ్యక్తి చటుక్కున బస్సుకిందకు పడ్డాడు...డ్రైవర్ అప్రమత్తమవడంతో తృటిలో ప్రమాదం తప్పింది...పుంగనూరు నుంచి విద్యార్థులతో వస్తున్న ప్రైవేటు బస్సు బస్టాండులోకి వచ్చింది. అప్పటి వరకు రోడ్డు పక్కనే వున్న మద్యం సేవించిన ఆమినిగుంట రవికుమార్ బస్సును ఆపేందుకు ప్రయత్నించి ముందుకు వెళ్ళి కిందకు పడ్డాడు. అంతే కాకుండా బస్సుకిందనే లోపలికి వెళ్ళిపోయాడు. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ వెంటనే బ్రేక్ వేసాడు. దీంతో చుట్టుపక్కలున్న వారందరూ బస్సుకింద నుంచి మద్య మత్తులో వున్న రవికుమార్‌ను వెలికి లాగి పడేశారు. రెప్పపాటులో జరిగిన ఈ ఉందతం అందరినీ కలవర పెట్టింది. నిత్యం బస్టాండులో మద్యపాన ప్రియుల ఆగడాలు శృతి మించుతున్నాయనీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గంగా భవానీ సేవలో పలమనేరు ఆర్డీఓ భవానీ

**బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 27 ప్రభాతవార్త**



శక్తి స్వరూపిణీ బోయకొండ గంగా భవానీని పలమనేరు ఆర్డీఓ భవానీ దర్శించుకొన్నారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పిం చారు. అంనతరంమండపంలో కుంకుమార్చన, వేదాశీర్వాదం తర్వాతపవిత్ర తీర్థప్ర సాదాలం దించి సత్కరించారు.

**న్యాయం చేస్తాం :** బోయకొండ గంగాపురంలో ఇళ్ళు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని పలమనేరు ఆర్డీఓ భవాని అన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా గతంలో పలు గృహాలను తొలగించిన విషయం విధితమే. నిర్వాసితులందరూ తమకు న్యాయం చేయాలని ఇటీవల చిత్తూరు, పలమనేరుల్లో ఉన్నతాధికారులకు మొర పెట్టుకొన్నారు. దీంతో ఆర్డీఓ భవానీ ఆయా స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో కాంప్లెక్సులు వంటి నిర్మాణాలు చేపట్టారా లేక ప్రైవేటు స్థలమా అని స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా కాటిపేరిలో ఏడూరి వీరభద్రకు చెందిన వ్యవసాయ భూమి ఆక్రమణపై విచారణ చేపట్టారు. డిటి మాధవి, మండల సర్వేయర్ గుణశేఖర్, విఆర్వోలు ఈశ్వర్, రెడ్డెప్ప, రెవిన్యూ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## దశాబ్దాల సమస్యను పరిష్కరించిన డిటి మాధవి

**పరికిదొన(చౌడేపల్లి), డిసెంబర్ 27 ప్రభాతవార్త**



పరికొదొనలో దశాబ్దాల తరబడి నెలకొనివున్న సమస్యను డిటి మాధవి పరిష్కరించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పరికిదొనలో సురేష్‌కు సంబంధించిన సమస్య దశాబ్ద కాలంగా వుంది. బాధితుడు ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిటి మాధవి గ్రామంలోని ఇరువర్గాలతోపాటు పెద్దమనుష్యులను ఆర్బీకే కేంద్రం వద్దకు చేర్చారు. బాధితుడు సురేష్‌కు వున్న భూసమస్యకు తనదైనశైలిలో పరిష్కారమార్గం చూపింది. దీంతో దశాబ్దాలుగా వున్న సురేష్ సమస్యకు పరిష్కారం లభించింది. సమస్యను పరిష్కరించిన తీరును గ్రామస్తులు అభినందించారు. ఆర్ఐ భారతి, సర్వేయర్ గుణశేఖర్, విఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు దామోదరంకు సన్మానం

**కార్వేటినగరం, డిసెంబరు 27 ప్రభాతవార్త:**



కార్వేటినగరం మండలం పాదిరికుప్పం జడ్పీహైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ పి.దామోదరంకు ఘనసన్మానం లభించింది. గత 37సం॥రాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పాలసముద్రం, యస్.ఆర్.పురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో సోషియల్ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తించారన్నారు. పదవీ విరమణ సందర్భంగా పి.దామోదరం, సతీమణి శ్యామలను ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు జె.గురుమూర్తి మాట్లాడుతూ దామోదరం టీచర్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిసుప్రసన్న, డిల్లీబాబు, ఎల్లయ్య, జ్యోతి, మునికృష్ణయ్య, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో వృద్ధులకు అన్నదానం

**కార్వేటినగరం, డిసెంబరు 27 ప్రభాతవార్త:**



కార్వేటినగరంరాస్‌ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీ ఆశ్రమంలోని వృద్ధులకు ఓ కుటుంబం అన్నదానం చేశారు. కార్వేటినగరం మండలం కెయంపురం పంచాయితి గొల్లకండ్రిగ గ్రామానికి చెందిన కె.మునిరత్నం 27వ వర్థంతి సంధర్భంగా అతని సతీమణి భారతి, పెద్ద కుమారుడు కిశోర్‌యాదవ్, కోడలు శైలజ, మనవరాలు ముక్తశ్రీ, మనవడు దీక్షిత్‌యాదవ్, ధీరజ్‌సాయి, సూపర్‌వైజర్ ప్రకాష్‌లు పాల్గొని వృద్దులకు అన్నదానంతో పాటు పండ్లు అందించారు.

## జాతీయస్థాయి అవార్డు సొంతం చేసుకున్న మదర్ థెరిసా పాఠశాల

**పెద్దపంజాణి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:**

ప్రతిష్టాత్మక ఇటి టెక్ స్కూల్ ఎక్సలెన్స్ 2024 అవార్డును స్థానిక మదర్ థెరిసా పాఠశాల సొంతం చేసుకుంది. హైదరాబాద్ హైటెక్ సిటీ నందు జరిగిన కార్యక్రమంలో 500 జాతీయ స్థాయి పాఠశాలలు పాల్గొనగా అందులో స్థానిక మదర్ థెరిసా పాఠశాలకు ప్రతిష్టాత్మక ఇటి టెక్ ఎక్స్ స్కూల్, సిబిఎస్ఇ ఉత్తమ అకడమిక్ ఎక్సలెన్స్ స్కూల్, బెస్ట్ ఎమర్జెంట్ స్కూల్, బెస్ట్ హ్యాపీనెస్ కోషియంట్ స్కూల్ గా ఎంపికావడం జరిగిందని పాఠశాల కరెస్పాండెంట్ డా.రవీంద్రబాబు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యతో పాటు విలువలు, విద్యతో పాటు సామాజికస్ఫూర్తిని విద్యార్థులకు అందిస్తుండడంతో ఈ అరుదైన గుర్తింపు పాఠశాల కైవసం చేసుకుంది. ఈ మేరకు కరెస్పాండెంట్ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## కరెంటు చార్జీల పెంపుపై నిరసన సెగ

**పలమనేరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** కరెంటు చార్జీల పెంపుతో ప్రజలను కూటమి ప్రభుత్వం నిలువు దోపిడి చేస్తున్నారని చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు విమర్శించారు. పట్టణంలో పెరిగిన కరెంటు చార్జీలకు నిరసనగా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడా ఆధ్వర్యంలో వైకాపా నాయకులు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గతంలో 2019లో టిడిపి ఖాళీ ఖజానా వైకాపా ప్రభుత్వానికి ఇచ్చిందని అయితే వైకాపా ప్రభుత్వం ప్రజలకు ఏ ఒక్క పథకం ఆపలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఇప్పటికి ప్రజలు సంక్షేమ పథకాలు అందించకపోనూ విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల వద్ద దోపిడి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను గాలికి వదిలి ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. సంక్షేమాలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం కోసం విద్యుత్ చార్జీలు పెంచమని నేడు మూడు రెట్లు ఎక్కువగా పెంచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు పవర్ కట్ - ట్రాన్స్‌కో డీఈఈ

**రేణిగుంట, డిసెంబరు 27 ప్రభాతవార్త:**

రేణిగుంట పట్టణం, మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలంలోని జ్యోతి నగర్, గణేష్ నగర్, ఆర్ఈ కోటర్స్, రామకృష్ణాపురం, సీబీఐడీ కాలనీల మీదుగా వెళుతున్న 132 కేవీఏ హైటెన్షన్ విద్యుత్ వాహక కండక్టర్లను(వైర్లు) మార్చడం కోసం విద్యుత్ సరఫరాను ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## మండల బీజేపీ అధ్యక్షుడిగా రాము

**విజయపురం, డిసెంబరు 27 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన విజయపురానికి చెందిన రాముని శుక్రవారం విజయపురంలో మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు. ఆయన ఎంపిక పట్ల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, నాయకులు పురుషోత్తంరెడ్డి, యుగంధర్‌రాజు, మునిరెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు ఆయనను పూలమాల, శాలువలతో అభినందించారు.

## సిఎంకు కృతజ్ఞతలు

తిరుపతి హెల్త్, డిసెంబర్ 27, ప్రభాతవార్త: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెరుల ఆదర్శప్రాయుడు ఒడ్డెర ఒబన్న జన్మదినాన్ని అధికారికంగా జరిపించేందుకు జిఓ ప్రవేశపెట్టిన సిఎం చంద్రబాబు నాయుడుకు జిల్లా వడ్డెర నూతన కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం వడ్డెర నూతన కమిటీ సభ్యులు మాట్లాడారు.

## మా భూములను ఆన్‌లైన్ చేయండి

**విజయపురం, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మాకు ప్రభుత్వం డీకేటీ భూములు పంపిణీ చేసి 20 సంవత్సరాలు అయినా మా భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని విజయపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు తహసీల్దార్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతిసారి వినతులు అందించినా ఫలితం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రతి రెవెన్యూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ ఉమ్మడి అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహరిపురంలో విద్యా విజ్ఞానిక ప్రదర్శన

**విజయపురం, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విజేతలు శనివారం మండల స్థాయిలో పాల్గొంటారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విజయచంద్రిక తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, రాధాకుమారి, సునీత, వెంకటేశులు, విజయవర్మ, వెంకమరాజు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

***తొట్టంబేడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త*** ఒవెన్యూ సదస్సుల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కళ్ళిపూడి, తాటిపర్తి, పంచాయతీ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ మధుసూధనరావు హజరయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ అన్నదాతల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈపథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. మండలంలోని 27 పంచాయతీలు 41 రెవెన్యూ గ్రామాల్లో ఈసదస్సులు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, విఆర్ఓ మునికుమారి, సర్వేయర్ హరనాథ్, నాయకులు శోభన్‌బాబు, ఎంపిటిసి చెంచులక్ష్మి పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బయో వేస్ట్ బర్నింగ్ పరిశ్రమను తరలించండి..!

రామచంద్రాపురం, డిశంబర్ 27 ప్రభాతవార్త:

రాయలచెరువుపేట సమీపంలోని రాజానగర్‌లో వున్న బయో వేస్ట్ బర్నింగ్ పరిశ్రమను సుదూర ప్రాంతానికి తరలించాలని కోరుతూ సర్పంచ్ మురగయ్య గ్రామస్థులతో కలసి తహశీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సు రాయలచెరువుపేటలో జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు నాయకులు నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## బంజారాల సాంప్రదాయాలు భారతీ సంస్కృతికి నిలువటద్దం

తిరుపతి విద్య డిసెంబర్ 27 ప్రభాత వార్త:

భారతీయ సంస్కృతికి బంజారాల సాంప్రదాయాలు నిలువటద్దమని పార్లమెంట్ సభ్యులు ఆజ్మీర్ సీతారం నాయక్ కొనియాడారు. ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా బంజారా జనసంగ్ అధ్యక్షులు మూడే హరిచాహన్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ఎస్వీయూ వీసీ అప్పారావుతో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారితో 12వ శతాబ్దిలో పాచికలు ఆడిన బంజారా ముద్దుబిడ్డ హథీరాంజీ భావాజీ అని గుర్తు చేశారు. బీజేఎస్ అధ్యక్షులు మూడే హరి చౌహన్ నాయక్ మాట్లాడుతూ జాతీయ సాంస్కృతిక ఉత్సవాల కార్యక్రమంలో అన్నమయ్య కీర్తనలు, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ జాతీయ నృత్యాలు, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఘనంగా నిర్వహించి ప్రజలలో భారతీయ సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆలోచింప జేసి అలరించాయి. ఈ కార్యక్రమంలో మాల్యా వెంకటేష్ నాయక్, వినోద్ రాథోడ్, హేమంత్ నాయక్, చంద్రశేఖర్ నాయక్ మధుకర్ నాయక్, నాగేంద్ర నాయక్, బాణావత్ వెంకటేష్ నాయక్, కిషోర్ నాయక్ ప్రియాంక నాయక్, రాజానాయక్, పెద్ద సంఖ్యలో గిరిజన నాయకులు, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## డీడీఈ పీజీ సైకాలజీ ఫలితాలు విడుదల

**తిరుపతి విద్య డిసెంబర్ 27 ప్రభాత వార్త:** ఎస్వీయూ డీడీఈ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్ లో జరి గిన పీజీ సైకాలజీ ఫైనల్ ఇయర్ ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాలకోసం ఎస్వీయూ అధికారిక వెబ్సైట్ ను సందర్శించాలి అని సూచించారు.

## ఎస్వీయూలో బి ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

**తిరుపతి విద్య డిసెంబర్ 27, ప్రభాతవార్త :**
యస్వీయూ బీఫార్మసీ కోర్సులో మిగిలి ఉన్న సీట్లకోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు.ప్రవేశం కోసం ఏపీసెట్ 2024లో అర్హత సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత,కేవలం ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.కోర్స్ ఫీజు సంవత్సరానికి రూ.81 వేలు చెల్లించవలసి ఉంటుందనీ, చేరదలచిన విద్యార్థులు ర్యాంక్ కార్డ్,సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో సోమవారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

## సదరన్ యూనివర్సిటీల సాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ ప్రదర్శన



**తిరుపతి విద్య డిసెంబర్ 27, ప్రభాతవార్త :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డిఎస్డబ్ల్యు సి ఎ ఆధ్వర్యంలో దక్షిణ భారత విశ్వవిద్యాలయాల సాంస్కృత పోటీలలో వర్సిటీ విద్యార్థులు ఘనమైన ప్రదర్శన ఇస్తున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్వీయూ విద్యార్థులు అద్భుత ప్రదర్శించేశారని కళాకారుల టీమ్ మేనేజర్ మరియు కల్చరల్కోఆర్డినేటర్డాక్టర్ పత్తిపాటి వివేక్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ఢిల్లీ రిపబ్లిక్ డే పెరేడ్ కు తిరుపతి విద్యార్థులు



***తిరుపతి విద్య డిసెంబర్ 27, ప్రభాతవార్త:*** జనవరి 26 న ఢిల్లీ వేదికగా జరిగే గణతంత్ర దినోత్సవానికి తిరుపతిలోని పలు విద్యాసంస్థలకు చెందిన ఎన్ఎస్ఎస్,ఎన్సీసీ విద్యార్థులు ఎంపికయ్యారు.ఇందులో పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్4కు చెందిన వాలంటీర్ ఎం రమ్య,ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్సీసీ మహిమరాజు,లోకేష్,రమేష్,అలాగే ఎస్వీ వెటర్నరీ కళాశాల నుంచి ఎన్సీసీ విద్యార్థిని అంజలి ఎంపికయ్యారు.పలు కఠోర పరీక్షలలో నెగ్గి అరుదైన అవకాశం దక్కించుకున్న విద్యార్థులను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్,అధ్యాపకులు,ఎన్సీసీ,ఎన్ఎస్ఎస్అధికారులుఅభినందనలవర్షం కురిపించారు.

## కిశోర్ వికాసంపై శిక్షణ కార్యక్రమం



**నింద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త :** కిశోర్ వికాసం కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని యంపిడిఓ కార్యాలయంలో నగరి ఐసిడియస్ ప్రాజెక్టు నగరి సిడిపిఓ కె.కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది.సిడిపిఓ కృష్ణవేణి మాట్లాడుతూ కిశోర్దశలో బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు ,వ్యక్తిగత శుభ్రత గురించి వివరించారు.ముఖ్య అథిది యంపిడిఓ శివప్రసాద్వర్మ మాట్లాడుతూ కిశోర్ బాలికలు, చదువులుతో పాటు వ్యక్తిగత శుభ్రత,డ్రాప్ఔట్ గురించి వివరించినారు.కార్యక్రమంలో ఇఒపిఆర్డి లక్ష్మిపతి, గోపి,పాఠశాల ఉపాధ్యాయులు నరసింహాలు,అపరంజిరాజు,మోహనయ్య, సూపర్వైజర్ శ్యామల,ఎయన్యంలు,వెల్ఫేర్అసిస్టెంట్,యంయస్కెలు,అంగన్వాడికార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలల హక్కుల కోసం రాస్ ముందంజలో ఉంటుంది - రమేష్రెడ్డి



**రేణిగుంట, డిసెంబరు 27 ప్రభాతవార్త:** బాలల హక్కుల సంరక్షణ కోసం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ముందంజలో ఉంటుందని బాలాజీ బాల వికాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్రెడ్డిఅన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి ఇందిరానగర్ రాస్ కార్యాలయంలో శుక్రవారం బాలాజీ బాల వికాస్ చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలలు బానిసలు కాదన్నారు. వారిని సంరక్షించడం కోసం అంతర్జాతీయ జాతీయ స్థాయిలో అనేక హక్కులు రూపొందించారన్నారు. చాలా మంది తల్లిదండ్రులు పేదరికం వల్ల పిల్లలను బడులకు పంపకుండా పనులకు పంపుతున్నారన్నారు. ఎంతో మంది చిన్నారులు వెట్టిచాకిరి చేస్తున్నారని, కొంత మంది తల్లిదండ్రులు తమతో పాటు పిల్లలను కూడా శాశ్వత వెట్టిచాకిరికి గురిచేస్తున్నారన్నారు. బాలలకు విద్యా హక్కు ఎంతో ముఖ్యమైందన్నారు. రాస్ అనుబంధ బాలాజీ బాల వికాస్ సంస్థ చైల్డ్ ఫండ్ ఆర్థిక సహాయంతో పిల్లల సంరక్షణ కోసం ప్రతి గ్రామంలో కమిటీలుచేస్తున్నదని ప్రజలంతా అందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ భారతి, మహిళా పోలీసులు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎం గేటు 56 మరమ్మతులను వెంటనే చేసి పునరుద్ధరించాలి

***పుత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:*** పుత్తూరు పట్టణంలోని ఆర్డీఎం రైల్వేగేటు 56 గత నాలుగు రోజులుగా పుత్తూరు నుంచి నారాయణవనం,పిచ్చాటూరు, నాగలాపురం(ఊత్తుకోట), సత్యవేడు ప్రజలు, ఉద్యోగ కార్మికులు, విద్యార్థులు సామాన్య ప్రజలు నిత్యం పోయేటువంటి గేటు రిపేరు కావడం వల్ల ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకు ఆ రైల్వే గేటును వెంటనే మరమ్మతులు చేసిపునరుద్ధరించాలని సీపీఎం ఆధ్వర్యంలో పుత్తూరు రైల్వేస్టేషన్ మాస్టర్ మేనేజర్ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. ఆర్డీఎం గేటు, మరాఠి గేటును ఓవర్బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే మేనేజర్ శ్రీనివాసులు స్పందించి రేపు ఆర్డీఎం గేటును మరమ్మతులు చేసి పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, విజయ్, సుబ్రహ్మణ్యం, యాసిన్ బాషా, సతీష్కుమార్, రమేష్, శరవణ పాల్గొన్నారు.

## పుత్తూరు మున్సిపాలిటీలో ఆటోలకు గేటు వసూలు రద్దు చేయాలి

***పుత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:*** పుత్తూరు పట్టణంలోని ఆటో వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో గేటు వసూలు రద్దు చేయాలని పుత్తూరు మున్సిపల్ కమిషనర్, చైర్మన్, వైస్ చైర్మన్, పుత్తూరు పట్టణ అధ్యక్షులు, టీడీపీ కౌన్సిలర్ జీవరత్నంలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా ఆటో వర్కర్లకు గేటు వసూలు చేయడం లేదని, ఈ పుత్తూరు మాత్రమే వసూలుచేయడం దారుణమన్నారు. రోజు వారి ఆటో నడుపుకోవడం కుటుంబం గడవక ఆటో ఫైనాన్స్ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్, యాసిన్ బాషా, శివ, సుబ్రహ్మణ్యం, రమేష్, కృష్ణమూర్తి,కందస్వామి, గోవిందస్వామి, సతీష్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయపు పన్ను చెల్లింపు దారులు సకాలంలోచెల్లించాలి

**పుత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** ఆదాయపు పన్ను చెల్లింపు దారులు విధిగా గుడువు లోపు ఆదాయ వ్యయాలకు సంబంధించి మొత్తం వివరాలు ఫైల్ చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును సకాలంలో చెల్లించాలని తిరుపతి ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ వంశీధర్ పేర్కొన్నారు. పుత్తూరులోని కేపీ రెసిడెన్సీలో తిరుపతి ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో టాక్స్ పేయర్స్, కన్సల్టెంట్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లించే వారు ముందస్తుగాకూడా చెల్లించవచ్చన్నారు.ఆదాయపు పన్ను శాఖ అధికారి శివరామకృష్ణ, చార్టెడ్ అకౌంటెంట్ సాయికుమార్, టాక్స్ ప్రాక్టీషనర్లు గజేంద్ర, రామకృష్ణ,యశ్వంత్, కేకేసీ లా కళాశాల విద్యార్థులు,ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్స్, ఇతర ఎన్జీ వోలు పాల్గొన్నారు.

## ప్రతి ఆహార వ్యాపారి పోస్టాక్ శిక్షణా సర్టిఫికేషన్ పొంది ఉండాలి

- ఫో స్టాక్ ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ పాలకొలను యశోద దేవి



**తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 27 ప్రభాతవార్త :** తిరుపతి డీఆర్డీఏ సమావేశంలో ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దులేటి హాజరై మాట్లాడారు. ప్రతి వ్యాపారస్తుడు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రత నాణ్యత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని క్లీన్ ఫుడ్ తయారు చేయాలని ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు.కల్తీని గుర్తించాలని, ఫుడ్ కలర్స్ అజినోమోటో టేస్టీ సాల్టును వాడకూడదని వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. కేవిజీవీఎం సౌత్ ఇండియా ఇంచార్జి టి సిందు మోహ న్బాబు, జిల్లా టీమ్ హెడ్ టి. పార్వతి, టి. లలిత, కన్నయ్య, పి. అక్షయ,పి. హరి, జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ ప్రొటెక్షన్ కౌన్సిల్ మెంబరు పి అమరనాథ్ హోటల్ పాస్ట్ ఫుడ్ టిఫిన్సెంబర్ బేకరీ సమోసా జిలేబి స్వీట్స్ టీ స్టాల్స్ చిప్స్ చికెన్ పకోడా, బజ్జీ సెంటర్స్ జూ సెంటర్స్ మెస్సుల నిర్వహించు యజమానులు ప్రతినిధులు, ప్రతినిధులు జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయ సిబ్బంది, సుమన్లు పాల్గొన్నారు.



## హెల్మెట్తోనే సురక్షిత ప్రయాణం

చంద్రగిరి, డిసెంబరు 27 ప్రభాతవార్త: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని సిఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. పౌరులకు ఆదర్శంగా పోలీసులు శుక్రవారం హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనా లను నడుపుతూ పోలీస్ స్టేషన్ నుండి ర్యాలీగా నూర్ జంక్షన్ వరకు తిరిగి టవర్ క్లాక్ వద్దకు చేరుకు న్నారు.సిఐ మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఎస్పీ ఎస్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసమే ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు, విద్యావంతులు, ఎన్జిఓలు హెల్మెట్ ధరిం చడంపై యువతకు అవగా హన కల్పించాలని సూచించారు.ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

## మన్మోహన్ మరణం దేశానికి తీరని లోటు

**తిరుపతి హెల్త్, డిసెంబర్ 27, ప్రభాతవార్త** మన్మోహన్ సింగ్ దేశ ప్రగతి ప్రజా సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధమైన పాలన సాగించినటువంటి గొప్ప నాయకుడని అని మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆయన మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరమైన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి సిమ్స్ను అపోలో యాజమాన్యం నుంచి కాపాడటమే కాకుండా జాతీయ హోదా కల్పించేందుకు అలాగే తిరుపతిలో ఏడువేల మంది నిరుపేద మహిళలకు ఇంటి స్థలాల కోసం 292 కోట్లు నిధులను విధులు చేయడమే కాకుండా శ్రీ సిటీ స్థాపన చేయడంలో ఆయన కృషి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో గోపిగౌడ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

## దేశం గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తను కొల్పోయింది: చంద్రప్ప



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త** భారత దేశం ఓ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తను కొల్పోయిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మన్నవరం వద్ద భెల్ పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేసి ఇక్కడి ప్రజలతో మమేకమయ్యారన్నారు.

## జాబ్మేళాలో 23 మంది ఎంపిక



శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విక్రమ్ డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్,సిడాప్, డిఆర్డిఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్మేళాలో 23 మందిని ఎంపికైనట్లు ప్రకటించారు. జబ్యేళా శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా కళాశాల క రస్పాండెంట్ కె.మునిలక్ష్మీ ప్రిన్సిపల్ వి.పట్టాభిలు హాజరయ్యారు. యువతి యువకులు ఇటువంటి జాబ్మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ జాబ్మేళాలలో 4బహుల జాతి కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 40మంది ఇంటర్యూలకు హాజరుకాగా 23 మంది వివిధ కంపెనీల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముఖ్యఅతిధుల చేతుల మీదుగా ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ను అందించారు.ఈ కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపల్ బి.ఈశ్వరమ్మ,నోడల్ ఆఫీసర్ ఎస్కె ఖదిరి,డాక్టర్ ఎస్ సుధాకర్, సినకల్ హబ్ కోఆర్డినేటర్ ఎస్.లక్ష్మీమోహన్, ఇఎస్సి కోఆర్డినేటర్ పి.వినయ్కుమార్ తదితరులుపాల్గొన్నారు.

## సృష్టికర్త మెచ్చేరీతిలో జీవన విధానం అలవరచుకోవాలి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



సృష్టికర్త మెచ్చేరీతిలో మనిషి జీవిత విధానాన్ని అలవరచుకోవాలని హాఫీజే ఖర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు.శుక్రవారం జామియా మస్జిద్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం మాట్లాడుతూ నేడు సమాజంలో పితూరీల జీవనం సాగుతుందన్నారు. మనిషి జీవితం రెండు విధాలుగా ఉంటుందని ఒకటి అల్లాహ్ ఆదేశించిన జీవితం,మరోకటి మన ఇష్టప్రకారం సాగించే జీవనం ఉందన్నారు. కానీ నేడు మనం ఆధ్యాత్మిక చింతనను విస్మరిస్తున్నాము.మన ఇష్టప్రకారం జీవితం సాగిస్తూ కష్టాలు,కన్నీళ్ళు దిగమింగుతున్నామన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని అల్లాహ్ మనకు మార్గదర్శకం చేస్తే దానిని మనం ఆచరించ మన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగాముస్లింమీద జరుగుతున్న దాడులు,దౌర్జన్యాలు పెచ్చుపెరిగి పోతున్నా యన్నారు.

## హోంగార్డు నిజాయితీ: పర్సు అప్పగింత

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేస్తున్న హోంగార్డుల నిజాయితీతో ఓభక్తురాలి పర్సును తిరిగి అప్పగించారు. శుక్రవారం హైదరాబాదుకు చెందిన భక్తులు సూర్యప్రకాస్ తన కుటుంబంతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.తిరుగుపయనంలో పగడ చెట్టు వద్ద కొంత సేపు సేద తీరారు.అక్కడ తమ పర్సును మరచిపోయారు.ఈ పర్సును గమనించిన హోంగార్డులు తీసి పెట్టుకొని మైక్లో సమాచారం అందించారు. సూర్యప్రకాష్ వచ్చి ఆనవాలు చెప్పటంతో పర్సు అప్పగించారు. ఈ పర్సులో నగదు రూ.99,296లుతో పాటు వేల రూపాయల విలువ చేసే స్మార్ట్ ఫోన్ను అందించారు. వారి నిజాయితికి దేవస్థానం పరిపాలనను వారు కొనియాడారు.

## ఎన్ ఫోర్సు మెంట్ విధులు పెంచాలి:బీట్సిస్టం బలోపేతం చేయాలి

ఏర్పేడు పోలీసు స్టేషన్ను తనిఖీ చేసిన ఎస్పి



శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండల పరిధిలో ఽరెండు జాతీయ రహదారులున్నాయి. ఏర్పేడు-వెంకటగిరి,ఏర్పేడు-శ్రీకాళహస్తిలు ఉన్నాయి. జాతీయ రహదారులు రూపుదిద్దుకోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నేరాలూ పెరిగే అవకాశం ఉంది.కాబట్టి అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్సి సుబ్బరాయుడు ఆదేశించారు.ఏర్పేడు పోలీసు స్టేషన్ను ఎస్పి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఇక్కడ స్టేషన్ ఆవరణలో ఉన్న ద్విచక్రవాహనాలు, పోలీసు స్టేషన్లో ఫైళ్ళ నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏర్పేడు మండలం కీలకం.పెద్ద పరిశ్రమలు, విద్యాసంస్థలు,విమానాశ్రయం ఉన్నాయి. కాబట్టి ఈ మండలంలో పని చేసే సిబ్బంది అప్రమత్తంగా జవాబుదారితనంతో పని చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు గస్తీని ముమ్మరం చేయాలన్నారు. అసాంఘీక కార్యక్రమాలు జరగకుండా బ్లూకోల్ట్స్,రక్షక వాహనాలతో నిరంతర గస్తీని నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో అడిషనల్ ఎస్పి రవిమనోహరాచారి, ఎల్అండ్ఓ డియస్పి శ్రీనివాసరావు,సిఐలు సుబ్రమణ్యం, డిసిఆర్బి జయచంద్ర,ఎస్ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎదగాలి!



**శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త** గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలని జాతీయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి వక్తృత్వపు పోటీల్లో మొదటి బహుమతి సాధించినందుకు అభినందన సభను ఏర్పాటు చేసారు.ఈ సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమారి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలకు చెందిన జాహ్నవి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో వక్తృత్వపు పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి సాధించిందని వివరించారు. అక్కడ ప్రభుత్వం జాహ్నవికి మెమెంటో,ధృవీకరణ పత్రం, మెడల్ నగదు బహుమతి రూ.5వేలు అందించారన్నారు. అభినందన సభలో కూనాటి సురేష్, శాంతి,మల్లికార్జున,రజియా,మురళి,రమేష్రెడ్డిశ్రీనివాసులుసుమతివిద్యార్థులు,వారితల్లిదండ్రులు పాల్గొన్నా

## వేసిన పంట నీళ్ళ పాలు:పొలాలంతా నీళ్ళ మయం

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలో ఎడతెరపి లేని వానలతో రైతులు వేసుకున్న పంటలు 20 రోజుల పాటు నీళ్ళలో ఉంటూ మురిగిపోయాయి. చుక్కలనిడిగల్లు,అమ్మపాళెం గ్రామాలు చెరువు నిండటంత కొస కట్ట తెంచటంతో పొలాలన్ని నీళ్ళ మయం అయ్యాయి. మళ్లీ పంట పెట్టడానికి చేతిలో కాసుల్లేదని శుక్రవారం శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ప్రజలు వాపోయారు. రెవెన్యూ సదస్సున తహశీల్దార్ లక్ష్మీనారాయన సారధ్యంలో చుక్కల నిడిగల్లు గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులకు చుక్కల నిడిగల్లుకు చెందిన చుక్కల రమేష్ టిఎంవి కండ్రిగ మాజీ సర్పంచ్ ఈశ్వర్రెడ్డి పాల్గొని రెండు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.రోడ్డు,పార్కు సమస్యలను వివరించారు. రెవెన్యూ సదస్సుల్లో తహశీల్దార్ లక్ష్మీనారాయణ మండల సర్వేయర్ పురుషోత్తం, చుక్కల నిడిగల్లు విఆర్ఓ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి బాల మురళి,వెల్ఫేర్ అసోసియేషన్ దివ్య,టిఎంవి కండ్రిగ సర్వేయర్ శశి సచివాలయ సిబ్బంది అధికారులు ఎపాల్గొన్నారు.

## కృషి,పట్టుదల,ఆత్మవిశ్వాసం ఉంటే విజయం తథ్యం



**తిరుపతి విద్య డిసెంబర్ 26 ప్రభాత వార్త:** స్థానిక కరకంబాడి రోడ్డులోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ నందు కొమండూర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు,విద్యావేత్త,కెవాసు పదవ తరగతి విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడం ఎలాగా అన్న విషయం గురించి ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ తమకు తామే పోటీ మరి ఎవరు లేరు సాటి అన్న చందాన నగరంలోని ఏ పాఠశాల విద్యార్థులకు లేని గొప్ప అవకాశం కొమండూర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులకు లభించడం విశేషం. ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థిని,విద్యార్థులు,పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఆర్ అనురాధ గోపాల్, ప్రమీల కృష్ణన్, ఏవో చంద్రశేఖర్,పి ఆర్ ఓ సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అబాకస్లో ప్రతిభ చూపిన భాష్యం విద్యార్థులు



**తిరుపతి విద్య డిసెంబర్ 27 ప్రభాతవార్త:** స్థానిక ధనలక్ష్మీ నగర్ లోని భాష్యం పాఠశాలలో జోనల్ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలోని భాష్యం లిటిల్ ఛాంప్స్లో చదువుతున్నటువంటి మూడవ, నాలుగవ ,ఐదవ తరగతి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిపను కనపరిచారు. గెలుపొందిన విద్యార్థులకు భాష్యం జోనల్ ఇంచార్జి లక్ష్మణ్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు,జెడ్ సి ఓ బిందు మాధవి ల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మన భాష్యం విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందరికీ అబాకస్ నేర్చుకునే అవకాశం కల్పించినందుకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణకి ,అబాకస్ శిక్షణను ఇస్తున్న ఎక్సెల్ అబాకస్ నిర్వాహకురాలు ప్రేమలతకి,జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## పేరూరు స్మశాన ప్రహరికి భూమిపూజ

-స్మశాన స్థలం పరిరక్షణే లక్ష్యం: టిడిపి నాయకులు



***తిరుపతిరూరల్,డిసెంబర్ 27 ప్రభాతవార్త:*** ఆక్రమణకు గురైతున్న స్మశాన స్థలం పరిరక్షణకే పేరూరు టిడిపి నాయకులు నడుం బిగించారు. స్మశానం చుట్టూ ప్రహరి గోడ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. పేరూరు టిడిపి అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమంలో టిడిపి తిరుపతిరూరల్ అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు, మధుశేఖర్, కాయం వెంకటేష్, వైకాపా నాయకులు జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో స్మశాన ప్రహరి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్మశానవాటికను చదును చేసి, పక్కనే వున్న పేరూరు చెరువు కంజుకాల్వలో పూడిక తీయించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో స్మశానవాటికకు ప్రహరీ గోడతో పాటు సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముకుందరెడ్డి, ప్రసన్న, దామినేటి నాగరాజ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణముఖి పరివాహక ప్రాంత ఇండ్లకు నో-అబ్జెక్సన్ ఇవ్వొద్దు



***తిరుపతిరూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త:*** స్వర్ణముఖి నదీపరివాక ప్రాంతంలో నిర్మించిన, నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు నో-అబ్జెక్సన్ సర్టిఫికేట్స్ జారీ చేయరాదని పంచాయతీ కార్యధర్శికి తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజులునాయక్ సూచించారు. ప్రభుత్వ భూములలో నిర్మించుకున్న నిర్మాణాలకు ఇంటిపన్నులు, కరెంట్ మీటర్లు తదితర సదుపాయాలు కల్పించడంతో ఆక్రమణలు ఎక్కువైతున్నాయని తెలిపారు. భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలంటే అధికారులు జారీ చేసే నో-అబ్జెక్సన్ సర్టిఫికేట్స్ను నిలిపివేయాలని సూచించారు. శుక్రవారం తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీలో 'రెవెన్యూ సదస్సు' నిర్వహించారు. ఓటేరు గ్రామ పంచాయతీలో సమతానగర్, రామక్రిష్ణనగర్,, డ్రైవర్ కాలనీ, గంగిరెడ్డుల కాలనీలలో సుమారు 500 కుటుంబాలు గత 30సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని, వీరికి మౌళికసదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి సర్పంచ్ చెఱుకుల జనార్ధన్యాదవ్, మాజీ సర్పంచ్ చిరంజీవిరెడ్డి, ఆర్ఐ రఘువర్మ, మండల సర్వేయర్ హేమకుమార్, పంచాయతీ కార్యధర్శి మునీశ్వరి, విఆర్వో బాలకృష్ణ తదిత్తరులు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సరంలో...'విద్యార్థులు గొప్ప లక్ష్యాలు సాధించాలి'

- 'కౌటిల్య' సెమినార్లో వక్తలు



**తిరుపతి,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** కొత్త సంవత్సరములో నూతన ఉత్సాహంతో గొప్ప లక్ష్యాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని 'కౌటిల్య' సెమినార్లో పలువురు వక్త సూచించారు. తిరుపతి ఎం,ఆర్.పల్లిలో వున్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్లో శుక్రవారం ' కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలు' అనే సెమినార్లో 'భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరాజు, సైకాలజిస్టు డాక్టర్ ఎన్.బి.సుధాకర్రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బ్యాంకు, ఇతర కేంద్ర ప్రభుత్వ పరీక్షలకు సన్నద్దమైతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలలో ఎలా నెగ్గాలో తగిన సూచనలు, సలహాలు చేసారు. సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో అంతర్గత శక్తి దాగిఉంటాదని, ఆశక్తిని బయటకు తీసి చదువుపై దృష్టి పెట్టాలన్నారు. డాక్టర్ సుధాకర్రెడ్డి మాట్లాడుతూ నేటి యువత చాలా మంది శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించకుండా ముసలివారైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం కౌటిల్య సంస్థ నూతన డైరీ, డాక్టర్ సత్యనారాయణరాజు ఆవిష్కరించగా, 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను డాక్టర్ ఎన్బి.సుధాకర్రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి, ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశమ్మ అమ్మవారి 2025 క్యాలెండర్ ఆవిష్కరణ



**నగరి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** నగరి గ్రామదేవత దేశమ్మ అమ్మవారి 2025 వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ మహోత్సవం టీఆర్ కండ్రిగలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు మదన్కుమార్, వెంకటాచలం చౌదరి ప్రోద్బలంతో దాతలు ఆనందరెడ్డి, శంకర్, హరిలు ముందుకొచ్చి అమ్మవారి సేవలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుణశేఖర్, జ్యోతినాయుడు, కృష్ణారెడ్డి(మాజీ చైర్మన్), దూర్వాసులనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు మదన్కుమార్, వెంకటాచలం, సుబ్బయ్య, మనీ, మాజీ కౌన్సిలర్ వెంకటేష్,రజని కుమార్, కృష్ణ,నీలకంఠం, చెంచయ్య, దేవస్థాన సిబ్బంది మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల వల్ల రైతులకు సమస్యలు పరిష్కారం

కేవీబీ పురం, డిసెంబరు 27 ప్రభాతవార్త:



రాష్ట్రంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని టీడీపీ పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు తెలిపారు. శుక్రవారం కేవీబీ పురం మండలంలోని రాయపేడు, వగత్తూరు గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ అక్రమాలు, భూ కబ్జాలు, రికార్డుల్లో గందరగోళం వంటి విషయాలన్నీ వెలుగు చూస్తూ అధికారులు దిద్దుబాటు చర్య ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాయపేడు, వగత్తూరు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ప్రతి రైతుకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్రెడ్డి, మండల మెజిస్ట్రేట్ మునిరత్నం, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, రాయపేడుసర్పంచ్బాలాజీ,ఫారెస్టు అధికారిసురేష్,మండలరైతుఅధ్యక్షులువెంకట్రామయ్య,రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగ శ్రీనివాసులు బాధ్యతలు విరమణ



**సత్యవేడు, డిసెంబరు 27 ప్రభాతవార్త:** సత్యవేడు జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రధాన ఆచార్యులుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాసులు సేవలను మరువలేమని అన్నమయ్య జిల్లా బీసీ బాలికల గురుకుల కన్వీనర్ సోమశేఖర్ కొనియాడారు. శుక్రవారం సత్యవేడు బాలుర గురుకుల పాఠశాలలో ప్రధాన ఆచార్యులు శ్రీనివాసులు ఉద్యోగ విరమణ వేడుకలను పాఠశాల చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఎస్ఎస్ఏ సీఎంవో సురేష్, ఐతేపల్లి గురుకుల ప్రిన్సిపాల్ దేవీసులోచన, ఉదయం మాణిక్యం గురుకుల ప్రిన్సిపాల్ రేష్మ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో ఉష, పూర్వపు రిటైర్డ్ ఉపాధ్యాయులు దండపాణి, ఆర్డబ్ల్యుసీ ఏఈ గిరి, ఉపాధ్యాయులు సురేష్, మునిచంద్ర, మల్లికార్జున్, బేబి, దీప, చలపతి, రత్నకుమారి, భాస్కర్,సురేష్కుమార్,పల్లవి,నాగార్జున, హరి, శరణ్య, సురేష్, శశి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో నాగాలాండ్ అధికారి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నాగాలాండ్ ప్రభుత్వ కార్యదర్శి తవశీలన్ కుటుంబసభ్యులతో వచ్చారు.వారికి మాజీధర్మకర్తల మండలి సభ్యుడు,వడలూరు మస్తానయ్య స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసారు.స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు ఆలయ పిఆర్ఓ రవి దర్శనం ఏర్పాట్లు చేసారు. దర్శనానతరం వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలుఅ ందించారు.

## విలువిద్య పోటీల్లో ద స్కూల్ విద్యార్థికి బంగారు పతకం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త



ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విలు విద్య పోటీల్లో శ్రీకాళహస్తిలోని ద స్కూల్ విద్యార్థి కె.లోహితా రెడ్డి బంగారు పతకాన్ని సాధించి పాఠశాల,శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసిందని పివిఆర్ గ్రూప్ డైరెక్టర్ ముకుందరావుజే.పవార్ అన్నారు. శుక్రవారం పాఠశాల అవరణలో విద్యార్థి అభినందన సభను ఏర్పాటు చేసారు. పాఠశాల హెడ్ మిస్ట్రస్ విశాల అధ్యక్షతన అభినందన సభను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద స్కూల్ విద్యార్థులు చదువుల్లోనే కాకుండా పోటీ పరీక్షల్లో కూడా రాణిస్తున్నారన్నారు. ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీల్లో దస్కూల్కు చెందిన విద్యార్థి కె.లోహితా రెడ్డి విలు విద్యలో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని సాధించిందన్నారు. జనవరి 5న రాజస్థాన్ జైపూర్లో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లోపాల్గొంటుందనివివరించారు.పాఠశాలఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## తొట్టంబేడు సర్పంచ్ను పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ

**.తొట్టంబేడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త** తొట్టంబేడు సర్పంచ్, అందరివాడు సుబ్బయ్య(సుబ్రమణ్యం) ఇటీవల అనారోగ్యానికి గురై చెన్నైలోని అపోలో అస్పత్రిలో చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరుకున్న సందర్భంగా ఆయన్ను మాజీ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయడు, చోడవరం సర్పంచ్ రమణారెడ్డి, తొట్టంబేడు మాజీ సర్పంచ్ గంగాధరంలు శుక్రవారం వెళ్ళి ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి ఆరాతీసి ఎలా ఉన్నారో తెలుసుకున్నారు.

## వైసీపీ పోరుబాటలో చిట్టమూరు వైసీపీ నేతలు



చిట్టమూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గూడూరులో జరిగిన పోరుబాట కార్యక్రమంలో చిట్టమూరు వైసీపీ నేతలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాల ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో జరిగిన పోరుబాట కార్యక్రమంలో చిట్టమూరు మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డితో పాటు వైసీపీ నాయకులు వై.చెంచుపుట్టబాబు, పాపయ్య, భార్గవ్, వందలాది మంది కార్యకర్తలతో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల వలన అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలోనే చిట్టమూరు మండలం నుంచి అధిక సంఖ్యలో మేరిగ మురళీధర్‌కు సంఘీభావంగా జరిగిన పోరుబాటలో పాల్గొన్నట్లు పుట్టబాబు (వైసీపీ) చెప్పారు.

# గూడూరు డివిజన్

## ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటుపరం తగదు

సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జనవరి నెల నుంచి ప్రైవేటుపరం చేయడం తగదని అఖిలభారత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన నేతలు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద ఈ విషయమై ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ విధానాన్ని అమలు చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని, ఈ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్టీఓ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాంబశివయ్య, పద్మనాభయ్య, లక్ష్మయ్య, కరీం, రాజాబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ మృతి బాధాకరం : నేదురుమల్లి



వెంకటగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : ప్రపంచ చిత్రపటంలో దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించిన భారతదేశం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి చెందడం బాధాకరమని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ అకాల మరణం చెందడంపై వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాలసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా కార్యదర్శి హరికృష్ణ ,జేసిఎస్ కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి,కౌన్సిలర్లు, నియోజవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష జేఏసీ విన్నపం



గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: పాఠశాల సముదాయముల పునర్వ్య వస్థీకరణలో భాగంగా చిల్లకూరు మండలంలో ఎన్ఆర్ పల్లి, వల్లిపేడు, గూడూరు మండలంలో చెన్నూరు బాలికలు హైస్కూల్ సముదాయాలను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ గూడూరు డివిజన్ ఉప విద్యాశాఖధికారి సనత్ కుమార్ కు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష జేఏసీ తరపున వినతి పత్రం ఇచ్చారు. చిల్లకూరు మండలంలో ఇదివరకు 6 పాఠశాల సముదాయాలు ఉండేవి ప్రస్తుతం వాటిని నాలుగు సముదాయాలుగా కుదించడం జరిగింది. అదేవిధంగా గూడూరు మండల పరిధిలో మొత్తం 8 పాఠాశాల సముదయాలు ఉండేవి వాటిని 7కు కుదించారు. ప్రధానంగా చిల్లకూరు, గూడూరు మండలాలు భౌతికంగా చాలా విశాలమైనవి. తొలగించిన సముదాయాలు ప్రస్తుతం కలిపిన పాఠశాల సముదాయాలకు చాలా దూరంగా ఉన్నాయి. ఇందు కారణంగా సంబంధిత పాఠశాలలకు అందించాల్సిన సదుపాయాలు పాఠ్య పుస్తకములు, విద్యా సామాగ్రి, ప్రశ్నాపత్రాలు మొదలైనవి అందించటానికి అనుకూలం కాదు. కావున పై సమస్యలను దృష్టిలో ఉంచుకొని యధావిదంగా ఆ పాఠశాల సముదా యాలను కొనసాగించాలని కోరి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ డా. బొమ్మి నాగరాజు, జేఏసీ మండల నాయకులు సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

## కరెంటు బిల్లులు పెంపుపై వైసిపి పోరుబాట



నాయుడుపేట,డిసెంబర్ 27 ప్రభాతవార్త : కరెంటు బిల్లులు పెంపుపై మాజీఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వైసిపి నాయకులు శుక్రవారం నాయుడుపేటలో పోరు బాట నిర్వహించారు. మాజీఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలను విపరీతంగా పెంచుతుందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలుకి ఇచ్చిన హామిలు నిరవేర్చడంలో కూటమిప్రభుత్వం పూర్తిగా విపలమైందన్నారు. ఆయన ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని విజయగణపతి ఆలయం నుండి కరెంటు ఆపీసు వరకు వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఈ కార్యాలయంలో విన్నతి పత్రం ఇచ్చేందుకు వెళుతున్న వైసిపి నాయకులను పోలీసులు అడ్డగించారు.దీంతో పోలీసులకు,వైసిపి నాయకులకు కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకొంది.ఎట్టికేలకు మాజీ ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వైసిపి నాయకులు డిఈకి విన్నతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపాల్టి చేర్మేన్ కటకం దీపిక,ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,మాజీ సహకార బ్యాంక్ చేర్మేన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాజారెడ్డి,మాజీ మండలపార్టీ కన్వినర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఇల్లుకూరుపాడులో రెవెన్యూ సదస్సు

కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త: కోట మండలం ఇల్లుకూరుపాడు గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ కె.జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం డిసెంబర్ 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజలు అందజేసిన అర్జీలను సదస్సులో ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లాఖాన్, సర్వేయర్ గోపిరెడ్డి,ఆర్ఐ మదులత విఆర్‌ఓలు, పాల్గొన్నారు

## నిఘ నేత్రాల వలె పనిచేస్తాం : డిఎస్పి



వాకాడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రక్షణ నిలయానికి వచ్చిన ప్రతి పేదవారికి న్యాయం చేసేందుకే పోలీస్ యంత్రాంగం నిఘనేత్రాలవలె పనిచేయడం జరుగుతుందని గూడూరు డిఎస్పి వి.వి.రమణ కుమార్ తెలిపారు. శుక్రవారం వాకాడులోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లోని క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని స్టేషన్ పరిధిలోనున్న గ్రామాలలో వాకాడు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారన్నారు, క్రైమ్ కేసులు తగ్గాయి అన్నారు. రాత్రి వేళలో టైం ప్రకారం పెట్రోలింగ్ తప్పనిసరి అన్నారు. ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. సర్కిల్, పోలీస్ స్టేషన్ పనితీరును డి.ఎస్.పి రమణకుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష, సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రెడ్డిపాలెం వాసి దుర్మరణం



వాకాడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త : వాకాడు మండలం రెడ్డిపాలెం గ్రామానికి మల్లాపు దేవేంద్ర బాబు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మల్లాపు దేవేంద్ర బాబు నెల్లూరు నుండి స్కూటర్ పై గూడూరుకు వస్తుండగా, మనుబోలు బ్రిడ్జి వద్ద ఎదురుగా కంటైనర్ ఢీకొనడంతో దేవేంద్ర బాబుకు తీవ్ర గాయాలయ్యాయని, చుట్టుపక్కల ప్రజలు గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం



వాకాడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రెవిన్యూ సదస్సులు ద్వారా పేదల భూ సమస్యలకు పరిష్కరించ్నడ కోసమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేయడం జరుగు తుందని తాసిల్దార్ రామయ్య అన్నారు. శుక్రవారం వాకాడు మండలం మొలగ నూరు, గంగన్నపాలెం గ్రామాలలో రెవిన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చినటువంటి అర్జీలను సత్వరమే పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మొలగనూరు ఉపసర్పంచ్ రావినూతల చెంచు కృష్ణయ్య, టిడిపి నాయకుడు దట్టం సురేష్ కుమార్, వివిధ శాఖల సిబ్బంది, రైతులు, స్థానిక ప్రజలు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఛార్జీలు పెంపుతో కూటమి పాలనపై ప్రజాగ్రహం



కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త: అధికారంలోకి వస్తే ప్రజలపై పైసా భారం ఉండదని, ఉన్న వాటిని తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో గొప్పలు చెప్పిన కూటమి నాయకులు తమ మార్కు పాలనతో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారని తిరుపతి జిల్లా వైసీపీ యువజన ప్రధాన కార్యదర్శి నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో తన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా ఉన్నవాటిని పెంచేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. నమ్మించి మోసం చేసిన కూటమి సర్కార్‌పై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతుందన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు విజయసారధిరెడ్డి, సర్పంచ్ బందిల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆ చిన్నారులను ప్రభుత్వం ఆదుకుంటుంది: ఎమ్మెల్యే పాశం



కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త: కోట మండలం కర్లపూడి గ్రామంలోని బిసి కాలనీలో ఉడతా వెంకటసుబ్బయ్యకు ముగ్గురు పిల్లలు. మొదటి ఆడ బిడ్డ ఆరోగ్యంగా ఉంది. ఆ తర్వాత జన్మించిన ఇద్దరు కుమారులు నాగరాజు, హర్షకు చిన్నప్పటి నుంచే శరీరం, ముఖం నల్లగా మారిపోయి దద్దుర్లుగా ఉన్నాయి. చర్మంపై చెమట పట్టకుండా తడి ఆరిపోయి పట్టలుపట్టలుగా పగిలిపోతూ ఉంటుంది. ఆ పిల్లల నరకయాతన చూడలేక తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. అప్పులు చేసి చెన్నైలోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. జన్యు లోపం వలన ఇలా వస్తుందని, పదేళ్ల తర్వాత సర్జరీ చేస్తామని అక్కడి వైద్యులు తెలియజేశారు. ఇటీవల కర్లపూడి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ కె.జయజయరావుకు ఆ చిన్నారుల తల్లిదండ్రులు తమ బిడ్డలను చూపించి ఆదుకోవాలని వేడుకున్నారు. దీంతో స్పందించిన తహశీల్దార్ కె.జయజయరావు రూ.5 వేలు నగదు వైద్య ఖర్చులు నిమిత్తం అందజేశారు. ప్రభుత్వం ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను ఎంపిడిఓ వేణు సేకరించారు.

## రైతుల సమస్య పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



చిల్లకూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని తమ్మిన పట్టణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రతి గ్రామంలో రెవిన్యూ సదస్సు జరుగుతున్న సందర్భంలో ఈ తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని లింగవరంలో ప్రజల సమస్యలను అర్జీల ద్వారా స్వీకరిస్తున్న మండల తాసిల్దార్ కే శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది వారి సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని రైతులకు రెవెన్యూ సిబ్బంది హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అధికారులకు సలహాలు ఇచ్చి పంపిన నాయకుడు పాశం సునీల్ కుమార్, పెనుసుల నరసింహస్వామి మాజీ చైర్మన్ శ్రీ నానాజీకి, మండల పార్టీ అధ్యక్షులు పుచ్చూరు వెంకటేశ్వర రెడ్డికి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచలు నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, నసిన సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ దారా కోటేశ్వరరావు, నాయకులు కోట సతీష్ యాదవ్, మేకల కోటయ్య, ఎల్లసిరి కోటయ్య, మరి కొంతమంది నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌ని కలిసిన తెలుగు మహిళలు



చిల్లకూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నామినేటెడ్ పదవులులో తిరుపతి పార్లమెంటు పరిధిలోని తిరుపతికి చెందిన రాష్ట్ర కార్యదర్శి పురిమట్ల కుమారికి రాష్ట్ర ఎస్సీ సెల్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి అన్నారు.పార్టీలో ఎంతో కాలంగా కీలకమైన పదవులు చేసి పార్టీకి విధేయురాలిగా ఉన్న కుమారికి ఈ పదవి ఇచ్చి తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి మహిళలు అయినా సరే తగిన గౌరవం దక్కుతుందని మన బాబు మన మంత్రి, యువగలం రథసారథి నారా లోకేష్ నిరూపించారని అన్నారు. తిరుపతిలోని వారి స్వగృహంలో పురిమాట్ల కుమారిని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, పార్లమెంటు కార్యదర్శి గుండాల భారతి, గూడూరు పట్టణ అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి పాల్గొన్నారు.

## ప్రజలపై పెనుబారం మోపిన ప్రభుత్వం: నేదురుమల్లి



వెంకటగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా చార్జీలు పెంచారని వైసిపి నియోజ కవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని వెంకటగిరి లోని నేదురుమల్లి భవనం నుండి సబ్ స్టేషన్ వరకు రాంకుమార్‌రెడ్డి నేతృత్వంలో ర్యాలీ నిర్వహి ంచారు. 15000 కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలను ప్రజలపై భారం మోపినట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జే సి ఎస్ కన్వీనర్లు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి ,చింతల శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కళ్యాణి ,సుబ్బారావు, నారాయణ, శ్రీనివాసులు, శంకరయ్య, నాయకులు మురళీకృష్ణ, బండి రమేష్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు కలెక్టర్



నాయుడుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొని ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సు లను నిర్వహిస్తుందని తిరుపతి జిల్లాకలెక్టర్ ఎన్ వెంక టేశ్వర్ పెర్కొన్నారు. ఆయన శుక్రవారం నాయుడుపేట మండలంలోని విన్నమాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గోన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లడుతూ తిరుపతి జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో డిసంబరు 6నుండి జనవరి 8వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ,ఆర్‌డిఓ కిరణ్మయి, తహసిల్దార్ రాజేంధ్ర, ఎంపిడిఓ సురేష్‌బాబు, కమిషనర్ ఫజులుల్లా, నెలవల రాజేష్,ఎఎంసి మాజీ చేర్మేన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి తదితర నాయకులు,అధికారులు పాల్గోన్నారు.

## విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని మాయాబజార్ ఎస్ఎఫ్ఐ కార్యాలయం ముందు గూడూరు టౌన్ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఏ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు హాజరయ్యారు. మాట్లాడుతూ గతంలో అమ్మఒడి బకాయిలు ఇంత వరకు విడుదల చేయలేదని అదేవిధంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారులకు రాగానే పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఎత్తేసి జీవో నెంబర్ 77లో తీసుకొని వచ్చారని దీనివల్ల అనేకమంది విజయ విద్యార్థులు విద్యకు దూరమయ్యారని తెలియజేశారు. అనంతరం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గూడూరు టౌన్ నూతన కమిటీ 26 మందితో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా యశ్వంత్, బ్రహ్మేంద్ర ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకటేష్ సుజిత్ సహాయ కార్యదర్శిగా కిరణ్, రాహుల్, కమిటీ సభ్యులుగా మధు, రాహుల్, రఫీ, శివ శ్రీకాంత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## నగరివీధి, బజారువీధుల్లో అగ్నిప్రమాదం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : పట్టణంలోని నగరివీధిలో నవయుగ హోటల్ పక్కనే నివాసం ఉంటున్న లక్ష్మీకాంతమ్మ నివాసం ఉంటోంది. ఇంటిలో ఉన్న దేవుని గదిలో వెలిగించిన దీపం కిందపడి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో రెండు బెడ్లు, టివి కాలిపోయాయని అగ్నిమాపకాధికారి పేర్కొన్నా రు. వెంటనే విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖాధికారులు అక్కడకు చేరుకుని ఇంట్లోకి వెళ్ళలేని పరిస్థితుల్లో కూడా పక్కనే ఉన్న నవయుగ హోటల్ మిద్దెపై నుంచి పక్కనే ఉన్న ఇంట్లోకి అతికష్టం మీద వెళ్ళిమంటలను అదుపు చేశారు. ఇంట్లో ఎక్కడా కిటికీలు లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపకశాఖాధికారులు తెలిపారు. మంటలను అదుపు చేయడంలో అగ్నిమాపక శాఖాధికారితో పాటు సిబ్బంది నాగార్జున తదితరులు పాల్గొన్నారు. కాగా బజారువీధిలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం సమీపంలో ఉన్న హోటల్‌లో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల గ్యాస్ లీకేజీ కారణంతో మంటలు చెలరేగాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

## వ్యాన్‌ని ఢీకొన్న లారీ - ఒకరు మృతి

గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త : గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చిట్వేల్ ప్రాంతానికి చెందినవారు గొర్రెల సంతకు వెళుతున్న క్రమంలో గొర్రెల లోడుతో వెళుతున్న టాటా మ్యాజిక్ మినీ వ్యాన్‌ను ఓ లారీ ఢీ కొట్టిన ఘటనలో కోడూరు మండలం పిట్టివారిపల్లి గ్రామానికి చెందిన కందలసోమయ్య (44) అనే వ్యక్తి మృతి చెందాడు.దాడిశెట్టి సుబ్రహ్మణ్యం సత్యాల చిన్న వెంకటయ్య, నరజాల రమణయ్య ఆరిపోయిన పెంచలయ్య నర్జాల సూర్యప్రకాష్ కట్ట ఈశ్వరయ్య తుంగ భాస్కర్ దాడిశెట్టి మని, వీరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే రూరల్ ఎస్సై మనోజ్ కుమార్ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ తరలించారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

**- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త : ప్రజలకు వైద్యాధికారులు మెరుగైన వైద్యం అందించాలని, ఆసుపత్రికి సంబంధించిన పలు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ గూడూరు డా.పాశం సునీల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి ఆసుపత్రి మొత్తం తిరిగి వార్డులో అడ్మిషన్ లో ఉన్న పేషెంట్లతో మాట్లాడుతూ చికిత్స ఎలా ఉంది అని, ఆహారం ఆస్పత్రిలో అందిస్తున్నది ఎలా ఉందని ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారా కలెక్టర్ అడుగగా చికిత్స బాగా చేస్తున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికుల కు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని తెలుపగా సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి సత్వరమే రెండు నెలలు పెండింగ్ వేతనాలు వారు చెల్లించడానికి ఒప్పించారు. గత నాలుగు సంవత్సరాల నుండి సుమారు రూ.23 కోట్లతో మంజూరు చేయబడిన నూతన ఏరియా ఆసుపత్రి భవనం ఇంకా పెండింగ్‌లో ఉండడం గమనించి మాట్లాడుతూ సదరు మేఘా ఏజెన్సీతో మాట్లాడి త్వరగా ఆసుపత్రి నూతన భవనం పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, ఓపీ తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శరీనా, సిఎస్ఆర్ఎంఓ రవికుమార్ ఇతర వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.98 కోట్లు ఆదాయం



కాణిపాకం, డిసెంబర్ 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.98 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. మంగళవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 24 రోజులకు గాను హుండీల ద్వారా 1,98,76,188 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 75 గ్రాముల బంగారు, 4 కిలోల 10 గ్రాముల గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 17,242 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 35,700 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 1,344 అమెరికా డాలర్లు, 10 యుఏఈ దినార్స్,35 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 155 యూరో కరెన్సీ,10 కెనడా డాలర్లు, 80 సింగపూర్ డాలర్లు, 290 ఆస్ట్రేలియా డాలర్లు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి,హుండీ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం నాయుడు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంకు, సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## శిక్షణకు దరఖాస్తు చేసుకోండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 27 ప్రభాతవార్త బి తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాలైన సేవలు అందించే వారి కోసం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు, హోమ్ ట్రైయాంగిల్ ప్లాట్ ఫారం ద్వారా వీరిని ఆన్‌బోర్డు చేయుట ద్వారా జీవనోపాధి కల్పించబడునని తెలిపారు. కావున పైన తెలిపిన సేవలు అందించే ఆసక్తి కలిగిన అభ్యర్థులు 27వ తేది నుండి 30వ తిరుపతి మున్సిపాలిటీలో మెప్మా కార్యాలయమును సంప్రదించాలని తెలిపారు.

## ఎస్వీయూలో క్యాన్సర్ నివారణపై ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు



తిరుపతి విద్య, డిసెంబర్ 27 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో అమెరికా అలభామ విశ్వవిద్యాలయము,బయోటెక్నాలజీ విభాగమూ ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ, మెడిసిన్స్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరపీకి అనే అంశంపై అన్ని అంశాలపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు బయోటెక్నాలజీ అభివృద్ధి ద్వారానే ఆ మొండి వ్యాధికి చికిత్సను అందించవచ్చు అన్నారు. క్యాన్సర్‌కు ఇప్పటికీ సరైన చికిత్స విధానం, ఔషధాల వినియోగం లేనందున బయోటెక్నాలజీ ద్వారా వాటికి సరైన చికిత్స విధానాలను రూపొందించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి,కన్వీనర్ డా.సరిత,డా జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు పెంచి పెనుభారం: ఎమ్మెల్సీ




గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: విద్యుత్ చార్జీలు పెంచి తెలుగుదేశం ప్రభుత్వం పేదవారిపై పెనుబారం మోపిందని ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీల పెంచాం అని చెప్పి నేడు పెంపు చేసి ప్రజలను మోసం చేశారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగా మురళి వెల్లడించారు. పోరు బాట కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని విద్యుత్ సబ్స్టేషన్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ నాయకులు ధర్నా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జీల పెంపను నిరసిస్తూ వైసిపి పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ మేరీగ మురళి మరియు వైసీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భక్తవత్సల రెడ్డి, పెద్దల మధుసూదన్ రెడ్డి పొలిపోయిన చంగయ్య, ఓడూరు బాలకృష్ణా రెడ్డి, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, నాగిశెట్టి శారద, నాగరాజు, సునీల్ రెడ్డి, గురవయ్య, ప్రసాద్ గౌడ్, సంపత్ కుమార్ యల్లసిరి జానకిరామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెకులు పంపిణీ



గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గ పరిధిలోని 8 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారు లకు క్యాంప్ కార్యాలయం నందు అందించారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నియోజక వర్గంలో నేను శాసన సభ్యులుగా ఉన్నపుడు 9 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే 32 మందికి 42 లక్షల 52 వేల రూపాయలు అందించామన్నారు. అలాగే కోట మండలం కర్లపూడి గ్రామం నందు స్కిన్ డిసీజ్‌తో బాధపడుతున్న చిన్న పిల్లలు నాగరాజు, హర్షాలకు క్యాంప్ కార్యాలయం నందు 20000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పులిమి శ్రీనివాసులు, చిల్లకూరు పట్టాభిరామ్‌రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, కరుణాకర్‌రెడ్డి, అన్న మునిశేఖర్, వాటంబేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.